కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.40, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.23, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.40, మునగ రూ.23, కందగడ్డ రూ.80, బీట్‌రూట్ రూ.15, కీర రూ.23, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.35.
ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

శుభాకాంక్షలు



కొమురయ్యతో వీరేంద్రబాబు యాదవ్

సైదాబాద్: ఎమ్మెల్సీగా ఎన్నికైన మల్క కొమురయ్యకు యాకత్‌పురా బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల ఎమ్మెల్సీగా ఎన్నికైన మల్క కొమురయ్య సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్ యాకత్‌పురా నియోజకవర్గ పార్టీ నాయకులతో కలిసి ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజావాణిలో నాలుగు ఫిర్యాదులు

చాదర్‌ఘాట్: మలక్‌పేట సర్కిల్–6లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నాలుగు ఫిర్యాదులు వచ్చాయని డీసీ జయంత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ నుంచి రోడ్డు ఆక్రమణ చేసి ఇల్లు నిర్మిస్తున్నారని, ప్రాపర్టీ ట్యాక్స్ తగ్గింపుపై రెండు ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అజంపురా డివిజన్ నుంచి డ్రైనేజీ పొంగి పొర్లుతున్నాయని ఫిర్యాదులు వచ్చాయన్నారు.

నేడు బీజేపీ జిల్లా అధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

మన్సూరాబాద్: బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి నేడు మన్సూరాబాద్‌లోని ఎంఈరెడ్డి గార్డెన్స్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్, మల్కాజిగిరి, చేవెళ్ల ఎంపీలు ఈటల రాజేందర్, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఏవీఎన్‌రెడ్డి, మల్కా కొమురయ్య హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. వనస్థలిపురంలోని రేణుకా ఎల్లమ్మ దేవాలయం నుంచి ఎంఈరెడ్డి గార్డెన్స్ వరకు బైక్‌ర్యాలీ ఉంటుందన్నారు.

రేషన్ దుకాణం వద్ద వాగ్వాదం

వ్యక్తిపై దాడి

మలక్‌పేట: రేషన్ దుకాణంలో సన్న బియ్యం అడిగినందుకు ఓ ఆటోడ్రైవర్‌పై దాడిచేసిన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల వివరాలు ప్రకారం.. మలక్‌పేటకు చెందిన ఆటో డ్రైవర్ కత్తుల భిక్షం సోమవారం ఆస్మాన్‌గఢ్‌లోని రేషన్ దుకాణానికి వెళ్లాడు. సన్న బియ్యం ఇవ్వకుండా దొడ్డు బియ్యం ఇస్తున్నావ్ ఎందుకని డీలర్ శ్రీనివాస్‌ను అడిగాడు. ఎలక్షన్ కోడ్ ఉందని తీసుకుంటే తీసుకో లేదంటే పారబోసి వెళ్లిపోవాలని డీలర్ దురుసుగా మాట్లాడాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న డీలర్ బంధువు(వరసకు కొడుకు) రాజు అనే యువకుడు ఒక్కసారిగా భిక్షంపై దాడి చేశాడు. తనపై దాడి చేసిన రాజు, డీలర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని భిక్షం పోలీసులను ఆశ్రయించాడు. మెజిస్ట్రేట్ అనుమతి తీసుకుని కేసు నమోదు చేస్తామని ఎస్సై నవీన్ తెలిపారు.

ఉత్సాహంగా 'శిజ్నే' సాంస్కృతిక ఉత్సవం

మీర్‌పేట: మీర్‌పేటలోని టీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల వార్షికోత్సవ ముగింపులో భాగంగా ఆదివారం రాత్రి నిర్వహించిన 'శిజ్నే' సాంస్కృతిక ఉత్సవం ఉత్సాహంగా జరిగింది. ఈ వేడుకకు ప్రముఖ గాయని జోనితా గాంధీ హాజరై తన పాటలతో విద్యార్థినీ, విద్యార్థులను ఉర్రూతలూగించారు. గాంధీతో పాటు మరో గాయకుడు రోల్‌రైడా ఆలపించిన పాటలకు యువత ఉత్సాహంగా నృత్యాలు చేశారు. అనంతరం విద్యాసంస్థల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి గాయని జోనితా గాంధీని సత్కరించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మేడిపల్లి మండల సీపీఐ ప్రధాన కార్యదర్శి రచ్చ కిషన్ సోమవారం కమిషనర్ శైలజకు వినతిపత్రం అందజేశారు. పలు డివిజన్లలో అక్రమ సెల్లార్లు, బహుళ అంతస్తులు, ఎలాంటి అనుమతులు లేని షట్టర్ల నిర్మాణం, వక్ఫ్‌బోర్డు స్థలంలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారన్నారు.

వర్షం వస్తే మునకే!

- దశాబ్దాలు గడిచినా కానరాని పరిష్కారం
- పట్టించుకోని అధికారులు
- అటకెక్కిన నాయకుల హామీలు



రెండ్రోజుల క్రితం కురిసిన వర్షానికి సింగరేణి కాలనీ ఇలా..

దిల్‌సుఖ్‌నగర్: ప్రభుత్వాలు.. ప్రజాప్రతినిధులు మారినా వారి సమస్యలు తీరవు. చినుకులు కురిస్తే చాలు వారిలో వణుకు మొదలవుతోంది. దశాబ్దాల తరబడి ముంపు సమస్యలతో సతమతమవుతూనే ఉన్నారు. ముంపు సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ చూపడం లేదని ఆయా ప్రాంతాల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మలక్‌పేట్‌జోన్ సరూర్‌నగర్, మలక్‌పేట్, సంతోష్‌నగర్ సర్కిళ్ల పరిధిలో వరద ముంపు కాలనీలు ఎక్కువగానే ఉన్నాయి. ప్రతి వర్షాకాలంలో వరదలు రావడం కాలనీలు మునగడం పరిపాటిగా మారింది. వర్షాలు వచ్చిన ప్రతిసారి అధికార యంత్రాంగం తాత్కాలిక నివారణ చర్యలు చేపట్టి చేతులు దులుపుకుంటున్నారు.

ముంచుకొస్తున్న ముంపు..

భారీ వరదలు వచ్చి ప్రతి సంవత్సరం ప్రజలు నిరాశ్రయులవుతున్నా ఇప్పటి వరకు శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు. అధికారులు వర్షాలు వచ్చే వరకు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం..వరదలు రాగానే కంటి తుడుపు చర్యగా విపత్తు నివారణ చర్యలు చేపట్టడం తర్వాత అటువైపు కన్నెత్తి చూడకపోవడం ప్రతి ఏడాది ఇదే జరుగుతోందని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షానికి ఓల్డ్‌మలక్‌పేట్, చాదర్‌ఘాట్, ఐఎస్ సదన్, అల్కాపురి, మార్గదర్శికాలనీ, సింగరేణి కాలనీ, అజంపుర, మలక్‌పేట్‌లోని పలు కాలనీలు, ప్రధాన రహదారులు ముంపులోనే ఉండిపోయాయి. దీంతో హడావిడిగా అధికారులు తాత్కాలికంగా చర్యలు చేపట్టారు తప్పా శాశ్వత పరిష్కారం చూపించ లేకపోయారు.అధికారుల నిర్లక్ష్యంపై కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరద సమస్యను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో కేవలం హామీలతోనే సరిపెడుతున్నారని ఆయా ప్రాంతాల వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉత్తుత్తి హామీలే..

గత రెండేళ్ల నుంచి నుంచి ముంపు సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యేలు హామీలు ఇచ్చి ఆ తర్వాత ఇటువైపు కన్నెత్తి చూడలేదు. శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలను రూపొందిస్తున్నామని త్వరలోనే ముంపు సమస్యలు పరిష్కారమవుతాయని హామీలు ఇచ్చి వదిలేశారు. ఏడాది గడిచినా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. గత ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆయా కాలనీల్లో పర్యటించి ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ముంపు కాలనీలవాసులు కోరుతున్నారు.

జూన్ వరకు పనులు పూర్తిచేయాలి



నబీల్ కాలనీలో ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

పహాడీషరీఫ్: వర్షాకాలం ప్రారంభమయ్యేలోపు జల్‌పల్లి మున్సిపాలిటీలోని నబీల్ కాలనీ ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పూర్తిచేయాలని మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. నబీల్ కాలనీలో కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులను సోమవారం ఆమె మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్, డీఈ ఇష్రత్ ఆయేషాలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2020 సంవత్సరంలో కురిసిన భారీ వర్షాలతో ఈ ప్రాంతమంతా ముంపునకు గురైందన్నారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నగర వ్యాప్తంగా రూ.850 కోట్ల నిధులతో ఎస్ఎన్‌డీపీ బాక్స్ నాలాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. ఒక్క మహేశ్వరం నియోజకవర్గంలోనే రూ.100కోట్లతో ఈ పనులు చేపట్టామన్నారు. ఇప్పటివరకు 60 శాతం మేర పూర్తయ్యాయని, మిగిలిన పనులను జూన్‌వరకు పూర్తి చేసేలా ఈ ప్రభుత్వం నిధులు విడుదల చేయాలన్నారు. ప్రస్తుతం జల్‌పల్లి నబీల్‌కాలనీలో కొనసాగుతున్న రెండో ఎస్ఎన్‌డీపీ నాలాకు జీహెచ్ఎంసీ తరపున 69 శాతం, జల్‌పల్లి మున్సిపాలిటీ నుంచి 31శాతం చొప్పున నిధుల కేటాయింపులు జరుగుతున్నాయన్నారు. ఈ పనులు పూర్తయితే నబీల్ కాలనీ ప్రజలకు ముంపు కష్టాలు దూరమవుతాయన్నారు. బాలాపూర్ కొత్తమోని కుంట నుంచి గ్రీన్ సిటీ, డ్రీమ్, మెట్రో సిటీలలో మొదటి దఫా ఎస్ఎన్‌డీపీ నాలా పనులను పూర్తయ్యాయని తెలిపారు. అంతకుముందు ఆమె కొత్తపేట రోడ్డులో నిర్మించిన బిన్ గాలిబ్ స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభించారు. బార్కాస్ సలాలలో ఫైసల్ బామ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈద్–మిలాప్ కార్యక్రమంలో సబితారెడ్డితో పాటు ఆమె తనయుడు పట్లోళ్ల కార్తీక్ రెడ్డి కూడా పాల్గొన్నారు. ఎమ్మెల్యే పర్యటనలో నాయకులు కైసర్ బామ్, అబ్దుల్లా గాలిబ్, జనార్దన్, షేక్ అఫ్జల్, పల్లపు శంకర్, యంజాల అర్జున్, ఉప్పుమూరి నిరంజన్, సయీద్ పటేల్, సయీద్ జాన్ తదితరులు పాల్గొన్నారు.

రోజు విడిచి రోజు నీరు సరఫరా చేయాలని వినతి



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న మాజీ కార్పొరేటర్ నర్సింహ, ప్రవీణ్

మీర్‌పేట: రోజు విడిచి రోజు మంచినీటిని సరఫరా చేయాలని కోరుతూ మీర్‌పేట కార్పొరేషన్ 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ సోమవారం జలమండలి జనరల్ మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మీర్‌పేటలోని 26, 6 డివిజన్లలోని కాలనీల్లో మూడు, నాలుగు రోజులకోసారి మంచినీరు సరఫరా అవుతోందని, దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా వేసవి కావడంతో ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోందని నర్సింహ జీఎం దృష్టికి తీసుకెళ్లారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని రోజు విడిచి రోజు నీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన నాయకుడు ప్రవీణ్ ఉన్నారు.

మార్కెట్ కళకళ





రెండ్రోజుల సెలవు అనంతరం మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ ఉల్లి, మిర్చి, చింతపండు సరుకులతో కళకళలాడింది. వివిధ జిల్లాల నుంచి 9775 క్వింటాళ్ల ఉల్లి, 3 వేల క్వింటాళ్ల మిర్చి 700 క్వింటాళ్ల చింతపండు దిగుమతి అయినట్లు అధికారులు వెల్లడించారు.
– చాదర్‌ఘాట్



9 నుంచి యోగా తరగతులు ప్రారంభం



పోస్టర్ విడుదల చేస్తున్న నిర్వాహకులు

వనస్థలిపురం: ప్రశాంత్‌నగర్‌లోని శ్రీ కనకదుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో ఈ నెల 9 నుంచి శ్రీ షిరిడీ సాయి అష్టాంగ యోగా శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం వనస్థలిపురం పార్కులలో జాగృతి అభ్యుదయ సంఘం చైర్మన్ భావన శ్రీనివాస్ అధ్యక్షతన యోగా శిక్షణ తరగతుల ప్రచారం నిర్వహించారు. ప్రతి రోజు ఉదయం 5.30 గంటల నుంచి 7 వరకు, సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7.30 యోగా సేవ రత్న స్వధర్మయోగి అవార్డు గ్రహీత ఇస్మాయిల్ గురుజీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. అనంతరం శిక్షణ తరగతులకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

విలీనం చేసేవరకు ఉద్యమం చేస్తాం



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న జేఏసీ నాయకులు

మహేశ్వరం: మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీఆర్.అంబేద్కర్ విగ్రహం నుంచి కొంగరకలాన్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వరకు ఫ్యూచర్ సిటీ జేఏసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్యూచర్ సిటీలో మహేశ్వరం మండలంలోని రెండు గ్రామాలు తుమ్మలూరు, మొహబ్బత్‌నగర్ గ్రామాలను మాత్రమే విలీనం చేసి ఇంకా 28 గ్రామ పంచాయతీలను విలీనం చేయకపోవడం సరింది కాదన్నారు. హైద్రాబాద్‌కు, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం, ఔటర్ రింగ్‌రోడ్డు, ఐటీ ఇండస్ట్రీలకు అతి చేరువలో ఉన్న మహేశ్వరం మండలాన్ని పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. స్థానికేతర నాయకులు మహేశ్వరం నియోజకవర్గంపై సవతి తల్లి ప్రేమను చూపిస్తూ నిర్లక్ష్యానికి గురి చేస్తున్నారన్నారు. త్వరలో మహేశ్వరం ఫ్యూచర్ సిటీలో మండలాన్ని విలీనం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డిని కలుస్తామన్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి వర్కల యాదగిరిగౌడ్, గౌరవ అధ్యక్షుడు కర్నాటి మనోహర్, జేఏసీ నాయకులు కడారి జంగయ్య, నందిగామ నర్సింహ, కాకి ఈశ్వర్, యాదయ్యగౌడ్, రాజునాయక్, చంద్రయ్య, దత్తునాయక్, సమీర్, రవినాయక్, రమేశ్, నర్సింహయాదవ్, పాండునాయక్, సుదర్శన్, మోహన్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

మహాలక్ష్మీ యాగం ప్రారంభం



శోభాయాత్రలో పాల్గొన్న త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి



కలశములతో స్వాగతం పలుకుతున్న మహిళలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ వాసవి కాలనీలోని అష్టలక్ష్మీ దేవాలయంలో మహాలక్ష్మీ యాగాన్ని ఘనంగా ప్రారంభించారు. అష్టలక్ష్మీ దేవాలయం నుంచి టెలిఫోన్ కాలనీ, రామకృష్ణాపురం మీదుగా అల్కాపురి, గ్రీన్‌హిల్స్ కాలనీ నుంచి అష్టలక్ష్మి దేవాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ సంఖ్యల్లో మహిళలు తరలివచ్చి స్వామికి స్వాగతం పలికారు. అనంతరం దేవాలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ నిర్వహించారు. శ్రీ భాష్యకారసిద్ధాంతపిత వ్యవస్థాపకాచార్యులు శ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయర్ స్వామి ప్రత్యేక పర్యవేక్షణలో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సోమ సురేష్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, మాజీ చైర్మన్ బంధం దామోదర్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్య, వైస్ చైర్మన్ నాగమల్లి శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



పోలీస్ బందోబస్తు మధ్య కొనసాగుతున్న నిరసన ర్యాలీ

పహాడీషరీఫ్: వక్ఫ్‌బోర్డు బిల్లు సవరణకు లోక్‌సభ, రాజ్యసభలలో ఆమోదానికి వ్యతిరేకంగా జల్‌పల్లి మున్సిపాలిటీలోని మైనార్టీ నాయకులు సోమవారం శాంతియుత నిరసన ర్యాలీని చేపట్టారు. షాహిన్‌నగర్ నుంచి ఎర్రకుంట చౌరస్తా వరకు కొనసాగిన ఈ ర్యాలీలో ముస్లింలు కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. ఈ బిల్లును వెనక్కి తీసుకోకపోతే ఏప్రిల్ 13న ట్యాంక్‌బండ్ వద్ద భారీ నిరసన కార్యక్రమాన్ని చేపడుతామని హెచ్చరించారు. ర్యాలీ సందర్భంగా మహేశ్వరం ఏసీపీ లక్ష్మీకాంతారెడ్డి, బాలాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

పాలిటెక్నిక్ పిలుస్తోంది

సాంకేతిక విద్య విద్యార్థుల భవితకు బాటలు వేయనుంది. పదో తరగతి అనంతరం ఈ విభాగాల్లో డిప్లొమా కోర్సులు చేసేందుకు వారికి పాలిటెక్నినిక్ కళాశాలలు దన్నుగా నిలుస్తుండగా.. ఈ కాలేజీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది.

- డిప్లొమా అనంతరం ఉజ్వల భవిష్యత్తు
- ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్లలో అనేక కొలువులు
- ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం
- ఆఖరు తేది ఏప్రిల్ 19, మే 13న పాలిసెట్

మహేశ్వరం: పాలిటెక్నిక్ 2025– 26 విద్యా సంవత్సరానికి కోర్సుల్లో అడ్మిషన్లకు ప్రవేశ పరీక్ష(పాలిసెట్) దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇటీవల పదో తరగతి వార్షిక పరీక్షలు రాసిన విద్యార్థులతో పాటు, పాసయిన వారు ఈ అర్హత పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు.

సర్కారు కళాశాలలో 180 సీట్లు

మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో 2023– 24 సంవత్సరంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించారు. ఇందులో మూడు డిప్లొమా కోర్సులు, 180 సీట్లు ఉన్నాయి. కోర్సులు.. సివిల్ ఇంజినీరింగ్–60 సీట్లు, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్ ఇంజినీరింగ్(ఈఈఈ)–60 సీట్లు, మెకానికల్ ఇంజినీరింగ్–60 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం మూడు విద్యాసంవత్సరాలకు కలిపి 540 విద్యార్థులు సాంకేతిక విద్యను అభ్యసిస్తున్నారు.



మహేశ్వరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

ఉద్యోగ అవకాశాలు

పాలిటెక్నిక్ డిప్లొమాలో మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్ అండ్ కమ్యూనికేషన్స్ కోర్సులు పూర్తి చేసే వారికి వివిధ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయి. సాఫ్ట్‌వేర్, ఇంజినీరింగ్, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, ఏయిర్ లైన్స్, ట్రాన్స్‌పోర్టు, గనులు, ఇండియన్ ఆర్మీ, నేవి, ఆర్టీసీ, ట్రాన్స్‌కో, జెన్‌కో, బీహెచ్‌ఈఎల్, టాటా, బీడీఎల్, డిఫెన్స్, డీఆర్‌డీఎల్, ఆర్‌సీఐ, బీఎస్ఎన్ఎల్ మొదలగు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేట్, కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగాలు పొందవచ్చు.

మహేశ్వరంలో భారీ పరిశ్రమలు

హైదరాబాద్‌కు చేరువలో ఉన్న మహేశ్వరం మండలంలో ఐటీ, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ కంపెనీలు అనేకంగా ఉన్నాయి. రావిర్యాలలో హార్డ్‌వేర్ పార్కు, శ్రీనగర్‌లో ఈ–సిటీ(ఫ్యాబ్‌సిటీ), తుమ్మలూరులో ప్లాస్టిక్ పార్కు, మంఖాల్ ఇండస్ట్రీ పార్కు, మహేశ్వరం మండల కేంద్రంలో విప్రో, మలబార్ గోల్డ్ కంపెనీలతో పాటు, కొంగర కలాన్‌లో ఫాక్స్‌కాన్, కెన్స్, ఆదిబట్లలో టాటా కంపెనీలు ఉన్నాయి. డిప్లొమా అనంతరం ఎక్కడో కాకుండా.. స్థానికంగానే ఉద్యోగ అవకాశాలు ఉండటంతో, పాలిటెక్నిక్‌లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. కోర్సు పూర్తి చేసిన తర్వాత ఈ సెట్ పరీక్ష రాసి, నేరుగా బీటెక్ రెండో సంవత్సరంలో చేరవచ్చు.

దరఖాస్తు వివరాలు

పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పాలిటెక్నినిక్ ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో ఈ నెల 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫీజు రూ.250 కాగా, బీసీ, జనరల్ కేటగిరి వారికి రూ.500 చెల్లించాలి. ఆలస్య రుసుం రూ.100తో ఏప్రిల్ 22 వరకు రూ.300 ఫీజుతో ఏప్రిల్ 23 వరకు గడువు కల్పించారు. డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు పరీక్ష మే 13న నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలను ఎస్‌బిటిఈటి.తెలంగాణ.జీఓవీటి.ఇన్ వెబ్‌సైట్‌లో చూడొచ్చు. 0

వినియోగించుకోండి..



పదో తరగతి పరీక్ష రాసిన వారితో పాటు పూర్తయిన వారు పాలిసెట్‌కు అర్హులు. అర్హత పరీక్ష రాసి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు పాలిటెక్నినిక్ కళాశాలలో సీట్లు పొందవచ్చు. టెస్ట్ పూర్తయిన వారు సీటు సాధించాలంటే ప్రత్యేక శిక్షణ అవసరం లేదు. పది సిలబస్‌తోనే ప్రశ్నలు ఉంటాయి. కష్టపడి చదివితే సీటు ఖాయం. డిప్లొమా అనంతరం ఉద్యోగ అవకాశాలు చాలా ఉన్నాయి. అర్హులు వినియోగించుకోవాలి.

– పి.నాగరాజ్, ప్రభుత్వ పాలిటెక్నినిక్ కళాశాల ప్రిన్సిపాల్, మహేశ్వరం